మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- వివాహం ఇష్టం లేక బలవన్మరణం
- సిద్దిపేట జిల్లా వరుకోలులో విషాదం

అనూష (ఫైల్)

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 25 : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వరుకోలుకు చెందిన మామిడి అనూష (30) ఐదేండ్లుగా భువనగిరిలో విధులు నిర్వర్తిస్తూ పట్టణంలోని విద్యానగర్‌లో అద్దెకు ఉంటున్నది. ఈ నెల 14న అనూషకు వివాహం నిశ్చయమైంది. ఈ పెండ్లి ఇష్టం లేక మనస్తాపంతో మంగళవారం ఇంట్లో ఉరేసుకున్నది. పోలీసులు మృతదేహాన్ని భువనగిరి దవాఖానకు తరలించారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు భువనగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఉచిత డ్రైవింగ్ క్లాసులు

- 18 నుంచి 45ఏండ్లలోపు మహిళలకు ఉపాధి కల్పన
- మహిళా కార్పొరేషన్‌పై మంత్రి సీతక్క సమీక్షా సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మహిళలకు జిల్లాలవారీగా ఆటో, కారు డ్రైవింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి.. ఉచితంగా శిక్షణ ఇస్తామని మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం మధురానగర్‌లోని మహిళా, స్త్రీ సంక్షేమశాఖ కార్యాలయంలో మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 18 నుంచి 45 ఏండ్లలోపు మహిళల ఉపాధికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రాల్లోని మహిళా ప్రాంగణాలను నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా మార్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క మహిళా ప్రాంగణాన్ని ఒక్కో రంగంలో శిక్షణ కోసం ఉపయోగించాలని సూచించారు.

నా మాటలు వక్రీకరించారు

- రెడ్డినేతలతోనాకు విభేదాలు లేవు
- మాజీ ఎంపీ అంజన్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి25(నమస్తే తెలంగాణ): తాను రెడ్లను దూషించినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనను స్వాగతిస్తూ యాదవ కుల బాంధవులతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా తాను అనని మాటలు అన్నట్టు మీడియా వక్రీకరించిందని పేర్కొన్నారు. ఓ సామాజిక వర్గాన్ని దూషించే వ్యక్తిత్వం కాదని తెలిపారు.

ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీలు

పండుగల వేళ ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఒకవైపు రాష్ట్రంలోని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పిన టీజీఎస్‌ఆర్టీసీ.. మరోవైపు అధిక చార్జీలు వసూలుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో 50% వరకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు బస్సుల ముందు భాగంలో చార్జీల బోర్డులు సైతం ఏర్పాటుచేసింది. దీంతో ప్రత్యేక బస్సులు పేరుతో అధిక చార్జీల వసూలుకు పాల్పడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కాగా, రాష్ట్రంలోని 43 శైవక్షేత్రాలకు 3వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు సంస్థ తెలిపింది. బుధవారం నుంచి 28 వరకు ఈ బస్సులను నడపనున్నట్టు వెల్లడించింది.

809 అదనపు బస్సులు..

నిరుడితో పోలిస్తే ఈసారి 809 బస్సులు అదనంగా నడుపుతున్నట్టు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడ వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు.

14 నెలల్లో 22 మంది పోలీసుల బలవన్మరణం

- మృతుల్లో కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకు..
- ఉద్యోగంలో ఒత్తిళ్లకు తోడు వ్యక్తిగత సమస్యలు కారణం
- మనోధైర్యం నింపలేకపోతున్న పోలీసు విభాగం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ప్రజలకు ధైర్యం చెప్తూ అండగా నిలవాల్సిన కొందరు పోలీసులు అర్ధాంతరంగా ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఉద్యోగ ఒత్తిళ్లకు తోడు, వ్యక్తిగత పరిస్థితులు బాధించడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ప్రేమ వైఫల్యంతో కొందరు, కుటుంబ సమస్యలతో మరికొందరు తనువు చాలిస్తున్నారు. ఇలా తెలంగాణలో కేవలం 14నెలల్లో 22 మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐ, సీఐలు ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసుశాఖలో ఆందోళన వ్యక్తమవుతున్నది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం 14 నెలల్లో ముగ్గురు ఎస్సైలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు, 14 మంది కానిస్టేబుళ్లు ఆత్మహత్య చేసుకున్నారు.

ఉద్యోగ ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు

రోజుల తరబడి కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించాల్సి వస్తున్నందున మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు రోడ్డెక్కిన సంగతి తెలిసిందే. వీటికి తోడు చాలీచాలని జీతంతో కుటుంబ నిర్వహణ కూడా భారంగా మారిందని కొందరు వాపోతున్నారు. తీవ్రమైన ఒత్తిడి మధ్య పని చేస్తున్నప్పటికీ.. ఊరట కల్పించే వాతావరణం లేదని ఆవేదన చెందుతున్నారు. పైగా కొందరు అధికారుల వేధింపులతో పలువురు ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి.



బంధం.. బాధ్యతారాహిత్యం.. బలవన్మరణం

కుటుంబ కలహాలతో కొందరు పోలీసులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరికొందరు ప్రేమ, వివాహేతర సంబంధాలతో తనువు చాలిస్తున్నారు. ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ రుద్రారపు హరీశ్ (29) గత డిసెంబర్‌లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. ఎస్ఐ హరీశ్ నిశ్చితార్థానికి ముందు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమించిన యువతి బ్లాక్‌మెయిల్ చేయడమే కారణమని పోలీసులు చెప్తున్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పీఎస్ కానిస్టేబుల్ శృతి మృతి తీవ్ర కలకలం సృష్టించింది. మరికొందరు బాధ్యత మరచి చిక్కుల్లో పడుతున్నారు.

మనోధైర్యం నింపే కౌన్సెలింగ్ ఎక్కడ?

వరుస ఆత్మహత్యలు నమోదవుతున్నా సిబ్బందిలో ధైర్యాన్ని నింపేందుకు చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలున్నాయి. కౌన్సెలింగ్ ఇప్పించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీరాములు తన ఇబ్బందులను సీఐకి చెప్పినా పరిష్కరించకపోగా, సూటిపోటి మాటలతో వేధించారని తెలిసింది.

14 నెలల్లో ఆత్మహత్య చేసుకున్న పోలీసులు

తేది	పేరు	హోదా	జిల్లా	కారణం
24-01-2024	సైదులు	కానిస్టేబుల్	సూర్యాపేట	ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు
07-04-2024	బాలేశ్వర్	కానిస్టేబుల్	హైదరాబాద్	విధుల్లో ఒత్తిడి
19-06-2024	భవానిసేన్	ఎస్ఐ	భూపాలపల్లి	మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం, సర్వీస్ నుంచి తొలగింపు
30-06- 2024	శ్రీనివాస్	ఎస్ఐ	భద్రాద్రి కొత్తగూడెం	అధికారుల వేధింపులు
06-09-2024	రమణారెడ్డి	కానిస్టేబుల్	భద్రాద్రి కొత్తగూడెం	అనారోగ్యం
09-09-2024	నరసింహరాజు	హెడ్ కానిస్టేబుల్	హైదరాబాద్	ఆర్థిక సమస్యలు
28-09-2024	బాలకృష్ణ	కానిస్టేబుల్	రంగారెడ్డి	విధుల్లో ఒత్తిడి
11-10-2024	సుధారాణి	ఏఎస్ఐ	మెదక్	ఎస్ వేధింపులు
13-10-2024	సాగర్	కానిస్టేబుల్	ఖమ్మం	అధికారుల వేధింపులు
13-10-2024	శ్రీనివాస్	హెడ్ కానిస్టేబుల్	మహబూబాబాద్	కుటుంబ కలహాలు
13-10-2024	ధరణి	కానిస్టేబుల్	హనుమకొండ	ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు
17-10-2024	వెంకట్రామయ్య	హోంగార్డు	హైదరాబాద్	ఆర్థిక సమస్యలు
01-12-2024	హరీశ్	ఎస్ఐ	ములుగు	ప్రేమ వ్యవహారం
26-12-2024	సాయికుమార్, శృతి	ఎస్ఐ, కానిస్టేబుల్	కామారెడ్డి	ప్రేమ వ్యవహారం
28-12-2024	బాలకృష్ణ	హెడ్‌కానిస్టేబుల్	రాజన్న సిరిసిల్ల	ఆర్థిక సమస్యలు
02-01-2025	కిరణ్	కానిస్టేబుల్	హైదరాబాద్	కుటుంబ కలహాలు
05-01-2025	శ్రీనివాస్	కానిస్టేబుల్	యాదాద్రిభువనగిరి	ఆర్థిక సమస్యలు
05-01-2025	భానుశంకర్	కానిస్టేబుల్	వికారాబాద్	విధుల్లో ఒత్తిడి
30-01-2025	వెంకటేశ్వర్లు	కానిస్టేబుల్	హైదరాబాద్	విధుల్లో ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు
16-02-2025	పవన్ నాయుడు	హెడ్‌కానిస్టేబుల్	జోగులాంబ గద్వాల	విధుల్లో ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు
25-02-2025	అనూష	కానిస్టేబుల్	యాదాద్రిభువనగిరి	ఇష్టంలేని పెళ్లితో మనస్థాపం
11-10-2024	సుధారాణి (ఆత్మహత్యాయత్నం)	ఏఎస్ఐ	మెదక్ జిల్లా	ఎస్సై వేధింపులు

భూ వివాదాల్లో పోలీసులు

- మామునూరు సీఐ రమేశ్‌ని కట్టడి చేయండి
- కబ్జాకోరులతో కలిసి బెదిరిస్తున్నారు..
- డీజీపీకి బాధితుల ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): సివిల్ తగాదాల్లో తలదూర్చొద్దని ఉన్నత న్యాయస్థానాలు చెప్పినా.. సాక్షాత్తూ పోలీసు బాస్ హెచ్చరించినా కొందరు పోలీసుల తీరు మారడం లేదు. బాధితులు డీజీపీ ఆఫీసుకు క్యూ కడుతున్నారు. తాజాగా వరంగల్ జిల్లా మామునూరు ఎస్‌హెచ్‌ఓ రమేశ్ రెండెకరాల భూ కబ్జాకు అండగా ఉన్నాడని, కబ్జాకోరుల నుంచి డబ్బులు తీసుకుంటూ తమకు అన్యాయం చేస్తున్నాడని బాధితులు మంగళవారం డీజీపీ జితేందర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. బాధితుడు సీహెచ్ రత్నాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2005లో ఇద్దరు పట్టాదార్, ముగ్గురు అనుభవదారులతో తిమ్మాపూర్ హవేలీలోని 125 సర్వే నంబర్‌లో మూడెకరాలను బాధితుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిపై కన్నేసిన ఉత్కం దీపక్ నకిలీ పత్రాలు సృష్టించి.. పోలీసులు, రెవెన్యూ అధికారుల సాయంతో రికార్డులు లేని మైదం ఐలయ్యను పట్టాదారుగా చూపించి కబ్జాకు యత్నిస్తున్నాడు. ఇందుకు మామునూరు సీఐ రమేశ్ కబ్జాదారుల పక్షాన వహిస్తూ బాధితులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. కబ్జాదారుడు దీపక్.. సీఐ సమక్షంలోనే బాధితులను 'ఈ రెండెకరాలే కాదు.. మీకున్న ఎకరం కూడా అమ్మేస్తా. ఏం చేస్తారో చేసుకోండి. ఎదురుతిరిగితే ఏమౌతారో మీకే తెలియదు' అంటూ బెదిరిస్తున్నా.. సీఐ రమేశ్ వారించే ప్రయత్నం చేయలేదని డీజీపీ ఎదుట వారు కన్నీటి పర్యంతమయ్యారు. వీరితోపాటు భరత్‌కుమార్ అనే ఓ మాజీ పోలీసు.. 'ఎంతోకొంత సెటిల్ చేసుకోవచ్చు కదా..' అంటూ బాధితుల బంధువులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు తెలిపారు. కాగా.. సీఐ రమేశ్‌ను గతంలో కూడా ఓ భూతగాదా కేసులో బదిలీ చేశారు. కబ్జాదారుడైన దీపక్‌పై 2012లో హన్మకొండకు చెందిన ఓ డాక్టర్‌ను కిడ్నాప్ చేసినట్టు బాధితులు డీజీపీకి తెలిపారు. వరంగల్ కమిషనర్ ద్వారా వివరాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చారు.

36వ సారి ఢిల్లీకి రేవంత్

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కూడా రేవంత్ రెడ్డి కలిసే అవకాశమున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం ఆశావాహుల లిస్టును సిద్ధం చేసుకొని వెళ్లినట్టు తెలిసింది. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతోపాటు, మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం పెద్దలతో ముఖ్యమంత్రి చర్చించే అవకాశముందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రాహుల్‌గాంధీని మరోసారి కలిసేందుకు సీఎం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికైతే రాహుల్ అపాయింటుమెంట్ లేదని, మోదీని కలిసిన అనంతరం ఏఐసీసీ నేతలు కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కుంభమేళాకు వెళ్లే అవకాశమున్నట్టు తెలిసింది.

ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ మార్చి 4కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న కేసు విచారణను సుప్రీంకోర్టు వచ్చేనెల 4కు వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టేలా అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద గత నెల 15న సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ 3 పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం మంగళవారం విచారణ జరపాల్సి ఉన్నది. కానీ, శాసనసభ కార్యదర్శి తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ అందుబాటులో లేకపోవడంతో విచారణ మార్చి 4కు వాయిదా పడింది.

నాన్‌లోకల్ సీట్లపై తేల్చని సర్కారు

- ఫలితంగా ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 1కి వాయిదా
- సీఎం ఆమోదం లభించక సందిగ్ధత.. సీఎంవోలోనే ఫైల్ పెండింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ఏదైనా ఫైల్ పంపిస్తే వెంటనే ఆమోదించడమో.. తిరస్కరించడమో చేయాలి. అత్యవసర అంశమైతే చకా చకా నిర్ణయాలు తీసుకోవాలి. కానీ పెండింగ్ పెడితే జరిగే నష్టం అంతా ఇంతా కాదు. ఇలా ఓ ఫైల్ పెండింగ్‌లో పెట్టడంతో మంగళవారం నుంచి ప్రారంభంకావాల్సిన టీజీ ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 1కి వాయిదాపడింది. లక్షలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు ఉదయం నుంచి యత్నించి విసిగిపోయారు. ఎప్‌సెట్‌లో నాన్‌లోకల్ సీట్లపై తేల్చకపోవడం, ఇందుకు సంబంధించిన ఫైల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదించకపోవడంతో దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్‌పడింది.

తొక్కిపెట్టిన సీఎంవో అధికారి

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేండ్లు అమలైన నాన్‌లోకల్ కోటాకు ఈ ఏడాది గడువు ముగిసింది. దీంతో ప్రభుత్వం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్టారెడ్డి అధ్యక్షతన కమిటీ వేసింది. ఈ కమిటీ చేసిన సిఫారసులు విద్యాశాఖకు చేరగా, సంబంధించిన ఫైల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం కోసం పంపించారు. ఆ ఫైల్ సీఎంవోకు చేరగా, సీఎంవోలోని కీలక అధికారి తొక్కిపెట్టారు. అయితే మంగళవారం నుంచి ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఫైల్‌పై ఆరా తీయగా, సదరు అధికారియే ఫైల్ అయినట్టు తెలిసింది. 'ముందే చెప్పకూడదా..? ఇప్పుడే ఏం తొందరొచ్చింది.. కొన్ని రోజులు వాయిదావేయండి' అని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. 'నాన్‌లోకల్ కోటాపై జీవో ప్రకారం నిబంధనలు అమలవుతాయన్న కండిషన్‌తో మంగళవారం నుంచి దరఖాస్తులకు అవకాశం కల్పించాలని కోరగా.. సీఎంకు చెప్పాలి.. ఆమోదం తీసుకోవాలి.. అప్పుడే దరఖాస్తులు స్వీకరించాలి' అని ఉన్నతాధికారి ఆదేశించగా దరఖాస్తుల స్వీకరణను వాయిదావేశారు.

చెట్లకు ఏర్పాటు చేసిన జియో ట్యాగింగ్

మొక్కలకు ఆధార్ నంబర్లు!

- 'డిజిటల్ ట్రీ ఆధార్' పేరుతో విలేజ్ డాటాబేస్
- ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే) గ్రామం ఘనత
- మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆలోచనకు ప్రతిరూపం
- గ్రీన్‌ఇండియా వ్యవస్థాపకుడు సంతోష్ కుమార్ ప్రశంసలు

హైదరాబాద్, ఇచ్చోడ ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): దేశంలో పౌరుల వివరాలు తెలుసుకునేందుకు, పథకాలను అమలు చేసేందుకు ఆధార్ కార్డును ప్రామాణికంగా పరిగణిస్తారు. అలాగే మొక్కలు, చెట్లకు కూడా ఆ గ్రామంలో నంబర్లు కేటాయించారు. సదరు నంబర్, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే మొక్కలు, చెట్ల వివరాలు తెలుసుకోవచ్చు. ఇది మరెక్కడో కాదు.. ఆదిలాబాద్ జిల్లా మఖ్రా(కే) గ్రామంలో అందుబాటులోకి వచ్చింది. మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి చొరవతో పచ్చదనం ప్రాధాన్యతను తెలియజేసేలా 'డిజిటల్ ట్రీ ఆధార్' పేరుతో ప్రత్యేక డాటాబేస్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతీ చెట్టును జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ కేటాయించారు. కోడ్‌ను స్కాన్ చేస్తే మొక్క, చెట్టు వయసు, ఆరోగ్యం, పెరుగుదల క్రమం, ఎంత ఆక్సిజన్ వస్తున్నది అనే వివరాలు తెలుసుకోవచ్చని గాడ్గే మీనాక్షి తెలిపారు. ప్రతీ ఒక్కరు నాటిన మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ కేటాయిస్తే సంరక్షణ సులభమవుతుందని చెప్పారు.

ముక్రా(కే) నుంచి అద్భుత ఆవిష్కరణ

'డిజిటల్ ట్రీ ఆధార్' విధానం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుంది. ప్రతీ మొక్కను జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ కేటాయించడం ద్వారా మొక్క పెరుగుదల, ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరిశీలించవచ్చు. మొక్కల సంరక్షణకు జవాబుదారీతనం, స్థిరత్వాన్ని ప్రోత్సహించవచ్చు. నిజమైన నాయకత్వం, పర్యావరణ బాధ్యత వల్లే ఇది సాధ్యమయింది. స్ఫూర్తిదాయకంగా నిలిచిన ముక్రా(కే) గ్రామానికి, మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి గారికి ధన్యవాదాలు.

– సంతోష్‌కుమార్, గ్రీన్ ఇండియా వ్యవస్థాపకుడు

రేపే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ముగిసిన ప్రచారం.. పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ స్థానాలకు ఎన్నికలు
- పోటీలో హేమాహేమీలు.. రసవత్తరంగా పోరు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్(ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్) రెండు ఎమ్మెల్సీ స్థానాలకు, నల్లగొండ, వరంగల్, ఖమ్మం(ఉపాధ్యాయ) ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరుగనున్నది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. ఇప్పటికే ఆయా జిల్లాల పరిధిలో అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. కాగా, మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసింది. కరీంనగర్ రెండు ఎమ్మెల్సీ స్థానాల నుంచి మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీలు ఉన్నారు. ఇందులో టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది, నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి 19 మంది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ప్రచారానికి తెర..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. మొత్తంగా మూడు ఎమ్మెల్సీ ఎన్నికల పోరు ఉత్కంఠరేపుతున్నది. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఎవరి బలమెంత అన్న చర్చోపచర్చలు టీచర్లు, గ్రాడ్యుయేట్లలో జోరుగా సాగుతున్నాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఎవరూ గెలిచే అవకాశాల్లేవన్న ప్రచారమున్నది. ఈ నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓటు ఒకరికి వేస్తే.. ఎవరికి రెండు, మూడు, నాలుగో ప్రాధ్యాత ఓట్లు వేయాలన్న చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఎవరు మొదటిస్థానంలో ఉంటారు.. ఎవరు ముందుగా ఎలిమినేట్ అవుతారు.. ఎలిమినేట్ అయిన వారి రెండో, మూడో ప్రాధాన్యత ఓట్లను ఎవరికి బదలాయించాల్సి వస్తుందన్న అంచనాలు, చర్చలు హాట్‌హాట్‌గా జరుగుతున్నాయి. పోలింగ్‌కు ఒక్కరోజు మాత్రమే సమయం ఉండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు కొందరు అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నల్లగొండలో హేమాహేమీలు..

ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం టీచర్స్ నియోజకవర్గం నుంచి హేమాహేమీలు పోటీలో ఉన్నారు. పీఆర్టీయూటీఎస్ నుంచి పింగిలి శ్రీపాల్‌రెడ్డి పోటీచేస్తుండగా.. ఆయన ప్రధానంగా ఆరు హామీలిస్తూ ప్రచారం చేశారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పింఛన్, మూడు నెలల కోసారి టీచర్లకు పదోన్నతులు, ఏకీకృత సర్వీస్‌రూల్స్, నూతన హెల్త్‌కార్డులు, కాంట్రాక్ట్ టీచర్లకు పేస్కేల్, మాడల్, గురుకుల టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు వంటి హామీలిచ్చారు. ఇక తాజా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి.. తాను చేసిన సేవలను, పోరాటాలను ఓటర్లకు వివరించారు. ఇక ఎమ్మెల్సీ నిధులను 100శాతం సర్కారు స్కూళ్ల బలోపేతానికే ఖర్చుపెట్టినట్టు చెప్పారు. జాక్టో నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పోటీచేస్తుండగా.. ఆయన బీసీ నినాదంతో ముందుకెళ్లారు. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసినప్పుడు టీచర్లకు, విద్యారంగానికి అందించిన సేవలను వివరించారు. తపస్-బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డి, టీపీఆర్టీయూ నుంచి హర్షవర్ధన్ రెడ్డి, సీపీఎస్ఈయూ నుంచి కొలిపాక వెంకటస్వామి, సుందర్‌రాజ్‌యాదవ్ మరికొందరు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

కరీంనగర్‌లో రసవత్తర పోరు..

ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో పోరు రసవత్తరంగా మారింది. తాజా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. పీఆర్టీయూటీఎస్ టికెట్లు అమ్ముకున్నట్టు ఆయన ఆరోపణలు గుప్పించారు. అనుభవం, ఆరేండ్ల పదవీకాలంలో తాను చేసిన సేవలు కలిసొస్తాయని, టీచర్లతో తనకున్న సంబంధాలు అనుకూలంగా మారుతాయని అంచనాలేస్తున్నారు. కార్పొరేట్, రియల్ ఎస్టేట్ వ్యాపారులను కాకుండా టీచర్‌నైన తనను గెలిపించాలని ప్రచారం చేశారు. ఇక తపస్-బీజేపీ నుంచి మల్క కొమురయ్య పోటీచేస్తుండగా ఆయన తనను గెలిపిస్తే జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల టీచర్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీలిచ్చారు. గురుకుల టీచర్లకు 010 జీరో పద్దు ద్వారా వేతనాలు, గురుకుల టీచర్లకు పదోన్నతులు, మహిళా టీచర్లకు రాత్రి డ్యూటీల నుంచి మినహాయింపునకు ప్రయత్నిస్తానని చెప్పారు. పీఆర్టీయూటీఎస్ నుంచి వంగ మహేందర్ రెడ్డి పోటీ చేస్తుండగా ఆయన ఉమ్మడి సర్వీస్ రూల్స్, మెరుగైన పీఆర్సీ, నగదురహిత వైద్యం, కేజీబీవీ, గురుకుల కాంట్రాక్ట్ ఉద్యోగులకు పేస్కేల్స్ వంటి హామీలిచ్చారు. ఈ నియోజకవర్గంలో పీఆర్టీయూకు ఉన్న బలం, 40 టీచర్ సంఘాలు మద్దతివ్వడం కలిసొస్తుందన్న ధీమాతో ఆయన ఉన్నారు. ఇక సీపీఎస్ఈయూ నుంచి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పోటీచేస్తుండగా ఆయన సీపీఎస్ రద్దు, పాత పింఛన్ అమలు ప్రధాన డిమాండ్‌తో సీపీఎస్ టీచర్ల మద్దతును కూడగట్టారు. టీపీటీఎఫ్ నుంచి అశోక్‌కుమార్, మామిడి సుధాకర్‌రెడ్డి సహా మరికొందరు అభ్యర్థులు సైతం బరిలో ఉన్నారు. ఇక ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో పోరు ఉత్కంఠగా మారింది. బీజేపీ నుంచి చిన్నమైల్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి వీ నరేందర్‌రెడ్డి(అల్ఫోర్స్), బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తదితరులు బరిలో నిలిచారు.

పోలీస్ అకాడమీ డీజీగా శ్రీనివాసరావు

గురువారం ఏపీల